సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 8 । ఫిబ్రవరి । 2023



వైభవంగా ఉరుసు ఉత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్: జగన్నాథపురం హజరత్ కాలే మస్తాన్ షా ఔలియా దర్గాలో మూడో రోజు మంగళవారం ఉరుసు ఉత్సవాలు వైభవంగా జరిగాయి.




మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: మద్ది ఆంజనేయ స్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు.

విజయలక్ష్మిగా మావుళ్లమ్మ

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ 59వ వార్షికోత్సవాల్లో మంగళవారం అమ్మవారిని విజయలక్ష్మిగా అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



న్యూస్‌రీల్

ఆర్జేడీ ఆకస్మిక తనిఖీలు



వెంకట్రావుతోట పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్జేడీ మధుసూదనరావు

నరసాపురం రూరల్: నరసాపురం నియోజకవర్గ పరిధిలోని నరసాపురం, మొగల్తూరు మండలాల్లో పలు పాఠశాలలను విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొగల్తూరు మండలం ముత్యాలపల్లి, నరసాపురం మండలం తూర్పుతాళ్లు, సీతారాంపురం సౌత్ వెంకట్రావు తోటలలోని పాఠశాలలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాడు నేడు పనుల గురించి ఆరాతీశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదన్నారు. ఆయన వెంట మండల విద్యాశాఖాదికారి పి.పుష్పరాజ్యం, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులున్నారు.

నాక్ గుర్తింపు తనిఖీలకు సిద్ధమవ్వాలి

తణుకు టౌన్: రాష్ట్రంలోని ప్రతీ ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాల నాక్ గుర్తింపునకు సంబంధించిన తనిఖీలకు సిద్ధం కావాలని కళాశాల విద్యా శాఖా కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ చెప్పారు. మంగళవారం తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జోన్ 1, 2 పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, జేకేజీ కోఆర్డినేటర్లతో నాక్‌కు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 170 ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ కళాశాలలు ఉండగా వాటిలో 109 కళాశాలల నాక్‌కు తనిఖీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తణుకు, రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లాల్లోని నోడల్ రీసోర్స్ సెంటర్లకు సంబంధించిన ప్రిన్సిపాల్స్, జేకేసీ సెంటర్ల కోఆర్డినేటర్లకు నాక్ సన్నద్ధతకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇటీవల నాక్ తనిఖీలలో ఏ గ్రేడ్ సాధించిన తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, నాక్ కోఆర్డినేటర్ జీ.చంద్రశేఖర్, ఇతర అధ్యాపక సిబ్బందిని అభినందించారు.

ఇళ్ల నిర్మాణాల కోసం ఇసుక డిపోలు

భీమవరం(ప్రకాశం చౌక్): పేదల ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక డిపోలను తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత ఏజెన్సీని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జగనన్న కాలనీల నిర్మాణాలకు అవసరమైన ఇసుక డిపోలను తప్పనిసరిగా సంబంధిత ఏజెన్సీ నిర్వహించాలని సూచించారు. ఇసుక రీచ్‌లపై సాంకేతిక అంశాలతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి నివేదిక సమర్పించాలన్నారు. జిల్లాలో కొత్తగా గుర్తించిన ఆచంట మండలం కోడేరు, కరుగోరుమిల్లి ఓపెన్ ఇసుక రీచ్‌లను సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జేవీ మురళి, డీఎస్పీ సుబ్బరాజు, గోదావరి రివర్ కన్జర్వేటర్ కాశీ విశ్వేశ్వరరావు, మైనింగ్ శాఖ డీడీ బి.రవికుమార్, ఏడీ ఎం. సుబ్రహ్మణ్యం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

36 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి తెలిపారు. ఇందులో భాగంగా 36 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్టు ఆమె చెప్పారు. స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. గత జాతీయ లోక్ అదాలత్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,556 కేసులను రాజీ చేసినట్టు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీ యోగ్యమైన అన్ని క్రిమినల్, సివిల్, వాహన ప్రమాద బీమా, చెక్ బౌన్స్, కుటుంబ వివాద కేసులు, మున్సిపల్ ట్యాక్స్, చిట్‌ఫండ్ కేసులు, కోర్టు ముందుకు రాని బ్యాంకు లావాదేవీలు, విద్యుత్ బకాయిలు, టెలిఫోన్ తదితర కేసులను ప్రీ లిటిగేషన్ కేసులుగా రాజీ చేస్తామన్నారు. కక్షిదారులు మండల న్యాయ సేవాధికార సంస్థలను గాని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థను గాని సంప్రదించవచ్చునని తెలిపారు.

టిష్యూ అరటి.. రాబడి మేటి

- ఉమ్మడి జిల్లాలో 1300 ఎకరాల్లో సాగు
- ఎకరానికి రూ.లక్ష వరకూ ఆదాయం
- విపత్తులు, తెగుళ్లు తట్టుకునేలా టిష్యూ అరటి అభివృద్ధి
- రైతులను ప్రోత్సహిస్తున్న ఉద్యానవన శాఖ



టిష్యూ కల్చర్‌లో సాగు చేస్తున్న పచ్చ అరటి

బుట్టాయగూడెం: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో అరటికి ఉన్న ప్రాధాన్యం ఎనలేనిది. ఈ నేపథ్యంలో అరటి దిగుబడిని పెంచేందుకు రూపొందించిన టిష్యూ అరటి ఇప్పుడు రైతుల అభిమానాన్ని అందుకుంటుంది. మంచి పరిమాణంలో ఉన్న కాయలతో పెద్ద సైజ్ గెలలతో ఎకరానికి 40 టన్నులు వరకూ అత్యధిక ఇస్తుంది. ఈ టిష్యూ కల్చర్ సాగును ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో విస్తరింపజేసేలా రైతులను ఉద్యానశాఖ అధికారులు ప్రోత్సహించడంతో సాగు విస్తీర్ణం ప్రతీ ఏడాది పెరుగుతుంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2500 ఎకరాల్లో టిష్యూ కల్చర్‌లో సుమారు 800 మంది రైతులు అరటి సాగు చేపట్టారు. జిల్లాల విభజనతో కొవ్వూరు తూర్పు గోదావరి జిల్లాలో కలవడంతో.. ప్రస్తుతం భీమవరం, ఏలూరు జిల్లాల పరిధిలో 750 మంది రైతులు సుమారు 1300 ఎకరాల్లో టిష్యూ కల్చర్‌లో అరటి సాగు చేస్తున్నారు. సాధారణంగా అరటి సాగును పిలకల ద్వారా చేస్తారు. కూర అరటి, కర్పూర, చక్కెర కేళి, అమృతపాణి, తదితర అరటి పంటలను పిలకల ద్వారానే సాగు చేస్తారు. అయితే టిష్యూ కల్చర్ సాగు అందుబాటులోకి రావడంతో దీనిపై అవగాహన పెంచుకున్న రైతులు టిష్యూ కల్చర్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

1300 ఎకరాల్లో సాగు : టిష్యూ అరటిలో అధిక ఆదాయం రావడంతో పాటు వాతావరణ స్థితిగతులు, గాలి దుమారాలను తట్టుకునే శక్తి ఉండడంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 1300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నర్సాపురం మండలాల్లో వర్జీనియా పొగాకు రైతులు కూడా టిష్యూ అరటి తోటల సాగు వైపు చూస్తున్నారు. ముఖ్యంగా టిష్యూ అరటితోటలు జిల్లాలోని ముసునూరు, కొయ్యలగూడెం, కామవరపుకోట, చింతలపూడి, ద్వారకా తిరుమల మండలాల పరిధిలో అత్యధికంగా సాగు చేస్తున్నారు. టిష్యూ కల్చర్ అరటిలో గ్రాండ్ 9 రకాన్ని రైతులు అత్యధికంగా సాగు చేస్తున్నారు. ఈ పద్ధతిలో సాగు చేసిన అరటి చెట్లు తక్కువ ఎత్తులో 5 నుంచి 5.65 అడుగులు ఉండడంతో గాలి దుమారాలను తట్టుకుంటాయని అధికారులు అంటున్నారు. ఆరోగ్యకరమైన మొక్కల నుంచి కణజాలాన్ని తీసుకుని అభివృద్ధి చేయడం వల్ల తెగుళ్లు దరిచేరవు. ఎకరానికి 1234 మొక్కలు నాటుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం గుర్తింపు పొందిన కంపెనీలు ఒక్కో మొక్కను రూ.12కు అందిస్తున్నారు.

అధిక దిగుబడి.. ఆదాయం మేటి

టిష్యూ కల్చర్ ద్వారా చేస్తున్న అరటి దిగుబడి ఎకరానికి 40 టన్నుల వరకూ వస్తుందని అధికారులు అంటున్నారు. దీంతో రైతులకు ఆదాయం కూడా అధికంగా వస్తుంది. టిష్యూ కల్చర్ అరటి ధర కాలాన్ని బట్టి ఉంటుందని అయితే ఎకరానికి రూ. లక్ష వరకూ ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రైతులకు టిష్యూ కల్చర్‌పై అవగాహన కలిగించి సాగు విస్తరణ మరింత పెంచేలా కృషి చేస్తామని అధికారులు అంటున్నారు. టిష్యూ కల్చర్‌లో అరటి సాగుకు ప్రభుత్వం సుమారు రూ. 40,985 వరకూ రాయితీగా ఇస్తుంది. మొదటి దశలో రూ. 30739, రెండో సంవత్సరం రూ. 10,246 చొప్పున రాయితీ ఇచ్చి రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది.

10 ఎకరాల్లో సాగు చేస్తున్నాను



నేను 10 ఎకరాల్లో టిష్యూ కల్చర్ అరటి సాగు చేస్తున్నాను. ప్రభుత్వాలు హెక్టారుకు రూ. 30,000 సబ్సిడీ ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రెండేళ్ల పాటు సబ్సిడీ ఇస్తుంది. ప్రస్తుతం సబ్సిడీ రావాల్సి ఉంది. సబ్సిడీ ఇచ్చి రైతును ప్రోత్సహిస్తే టిష్యూ కల్చర్ అరటిసాగు లాభదాయకంగా ఉంటుంది.

– లింగారెడ్డి శ్రీనివాసరావు, రైతు, కె.జగ్గవరం, టి.నర్సాపురం మండలం

టిష్యూ కల్చర్ సాగును ప్రోత్సహిస్తాం



ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో టిష్యూ కల్చర్ అరటి సాగు ప్రతీ ఏటా పెరుగుతుంది. ఉద్యాన వన శాఖ ద్వారా ఈ సాగును ప్రోత్సహిస్తున్నాం. టిష్యూ అరటిలో అధిక ఆదాయం రావడంతోపాటు వాతావరణ పరిస్థితులను తట్టుకునే పరిస్థితులు ఉండడంతో రైతులు టిష్యూ కల్చర్ అరటిసాగుపై ఆసక్తి చూపుతున్నారు. రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చేలా నిర్దేశించింది.

– ఏ. దుర్గేష్, ఉద్యానవన శాఖ ఏడీ– పశ్చిమ గోదావరి జిల్లా

నాడు-నేడు సువర్ణాధ్యాయం



సీసీ రోడ్డు, స్కూలు ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: చరిత్రలో నాడు-నేడు పథకం సువర్ణాధ్యాయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పెంటపాడు మండలం జట్లపాలెంలో ఎంపీయూపీ ప్రాథమిక పాఠశాల నాడు-నేడు పథకంలో తొలివిడత పనులు పూర్తవడంతో మంత్రి స్కూలును ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎస్ఎన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎంతో ఆలోచనతో జగనన్న చేస్తున్న నాడు-నేడు పనులు దేశానికే ఆదర్శమన్నారు. ప్రతిపక్షాలు జగనన్న చేసిన పనిని మెచ్చుకోలేక, ఇంగ్లిషు మీడియం, నాడు- నేడు పనులపై బురద జల్లుతున్నాయన్నారు. అమ్మఒడి కూడా ప్రజలకు వరం లాంటిదన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలన్న ఉద్దేశంతో ఈ పథకం ప్రవేశపెట్టారన్నారు. నూరు శాతం అక్షరాస్యత సాధించేందుకు, రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు నూతన ఒరవడిని సృష్టించారన్నారు. ఎంపీసీ దాసరి హైమావతి, సర్పంచ్ ఖండవల్లి మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కట్టుబోయిన వెంకటలక్ష్మి, జిల్లా, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, కట్టుబోయిన కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు రత్నరాజు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ మెచ్చేలా సీఎం జగన్ పాలన



ఆచంట మండల గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: దేశంలో అందరూ మెచ్చేలా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల నమ్మకంతో చరిత్రలో నిలిచారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం ఆచంట రామేశ్వర స్వామి మండపంలో ఆచంట మండలంలోని వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణా సదస్సులో పాల్గొన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా వారి ఖాతాల్లో జమచేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గతంలో సంక్షేమ పథకాలను జన్మభూమి కమిటీల ద్వారా అమలు చేసి అవినీతిని ప్రేరేపించి వ్యవస్థలను చంద్రబాబు భ్రష్టు పట్టించారన్నారు.

లోకేష్ అజ్ఞాని

పాదయాత్ర ప్రారంభించిన చంద్రబాబు తనయుడు అజ్ఞాని అని విమర్శించారు. చంద్రబాబు పాలనలో 10 లీటర్ల పాలు ఇచ్చే పశువులు, నేడు జగన్ పాలనలో 5 లీటర్లు ఇస్తున్నాయంటూ వ్యాఖ్యానాలు చేస్తూ ప్రజలకు నవ్వులు పుట్టిస్తున్నాడని చలోక్తులు విసిరారు. సైకిల్ పోవాలంటూ నినాదాలు చేయడంతో పాటు, అడిగి మరీ జేజేలు కొట్టించుకొంటున్న ఏకైక నాయకుడు లోకేష్ అన్నారు. గృహసారథులు సీఎం జగన్‌కు ఆత్మీయులు వంటివారన్నారు. నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిళా రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ కార్యకర్తలు, నాయకులకోసం ఆలోచిస్తున్నారన్నారు. శ్రీరంగనాథరాజుకు ప్రజలు అండగా నిలిచి గతం కంటే రెండింతల మెజార్టీ అందించాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, గణేషుల శేషవేణి సుబ్బారావు, జక్కంశెట్టి చంటి, జక్కంశెట్టి శ్రీరాములు, బోడపాటి బుల్లియ్య పాల్గొన్నారు.

జగన్‌తో విద్యా రంగంలో పెనుమార్పులు

- విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- నన్నయ క్యాంపస్‌లో బీ ఫార్మసీ భవనాల ప్రారంభం



ఉమెన్స్ హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తున్న విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, పౌర సరఫరాల మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తదితరులు

తాడేపల్లిగూడెం అర్బన్ : భవిష్యత్ ప్రజాప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులు విద్య అభ్యసించాలని విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి విద్యారంగంలో పెనుమార్పులు తీసుకొచ్చి దేశంలోనే రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపారన్నారు. ప్రస్తుత ఏడాది విద్యా రంగానికి రూ.30 వేల కోట్లను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెచ్చించారని చెప్పారు. స్థానిక నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో రూ.13 కోట్లతో నిర్మించిన ఫార్మసీ కళాశాల భవనాలు, రూ.2.50 కోట్లతో నిర్మించిన ఉమెన్స్ హాస్టల్ భవనాలను మంగళవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో బీఫార్మసీతో పాటు ఎం ఫార్మసీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని, ఎంకామ్, ఎంసీఏ, ఎంఎస్సీ డేటా అనాలసిస్ విభాగాలు, మహిళా ఇంజినీరింగ్ కళాశాల, మెన్స్ హాస్టల్ ఏర్పాటుకు సహకరించాలని బొత్స సత్యనారాయణను కోరారు. క్యాంపస్‌లో రెగ్యులర్ ఫ్యాకల్టీలు, సిబ్బందిని నియమించాలని కోరారు. క్యాంపస్‌లో క్రీడాస్థలాన్ని, రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. క్యాంపస్‌కు వచ్చే మార్గం స్థానిక గణేష్ నుంచి అధ్వానంగా ఉండటంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని చెప్పారు. మంత్రి బొత్స మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కోరిన సహకారం అందిస్తామన్నారు. నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో హాస్టల్‌కు అవసరమైన సౌకర్యాలను తక్షణం ఏర్పాటు చేయాలని క్యాంపస్ రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి ఎదగాలని కోరుకుంటారో నిర్ణయించుకుని ఆ దిశగా చదువులో రాణించాలన్నారు. పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యంతో విద్యనభ్యసించి తల్లిదండ్రులకు, దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చి 14వ స్థానం నుంచి 2వ స్థానానికి తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. వైస్ చాన్సలర్ జీవీ ప్రసాదరాజు, జాయింట్ కలెక్టర్ మురళీ, ఆర్డీఓ దాసి రాజు, ఎస్పీ యువీ రవిప్రకాష్, యూనివర్శిటీ రిజిస్ట్రార్ అశోక్, ప్రిన్సిపల్ రమేష్, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వెలనాటి నరేంద్రకుమార్, ముప్పిడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సంధ్యా కాంతులు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో వెంకటరమణ, రచయిత సుధాకర్, చంద్రాజీ తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్): 'సంధ్యా కాంతులు' పేరుతో ప్రచురించిన నానీల కవితా సంకలనం సామాజిక సమస్యలకు అద్దం పట్టిందని పలువురు వక్తలు తెలిపారు. కవి, రచయిత గండి సుధాకర్ రాసిన ఈ సంకలనాన్ని మంగళవారం నాడు జిల్లా విద్యాశాఖాధికారి వెంకటరమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో సెల్‌ఫోన్, ఫేస్‌బుక్‌లలో విద్యార్థులు, తల్లిదండ్రులు సమయాన్ని గడిపేస్తూ తెలుగును విస్మరిస్తున్నారన్నారు. ఈ దశ క్షీణించకముందే తెలుగు కవులను, సాహితీవేత్తలను గౌరవించి, తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు పండితుడు దాయిన సురేష్ చంద్రాజీ ఈ పుస్తకంపై చక్కటి విశ్లేషణ చేశారు. సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, త్సవటపల్లి సాయి వెంకన్న బాబు, అడ్వకేట్, కవి పుచ్చకాయల బ్రహ్మాజీరావు, గండి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పాట్ బిల్లింగ్ టెండర్లకు రంగం సిద్ధం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో గృహ, వ్యాపార అవసరాల విద్యుత్ బిల్లులను తీసే స్పాట్ బిల్లింగ్ ఏజెన్సీల కాలపరిమితి వచ్చే మార్చి 31తో ముగుస్తోంది. ఈ మేరకు ఏప్రిల్ ఒకటి నుంచి బిల్లుల రీడింగ్ తీయడానికి కాంట్రాక్టర్లకు అనుమతి మంజూరు చేయాల్సి ఉంది. దీని కోసం స్పాట్ బిల్లింగ్ టెండర్లను త్వరలో ఆహ్వానించడానికి విద్యుత్ సంస్థ అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. 2023 నుంచి 2025 వరకూ కాలపరిమితి ఉండేలా నూతన కాంట్రాక్టర్లకు అవకాశం ఇచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలో 23 సబ్ డివిజన్లు ఉండగా అన్ని సబ్ డివిజన్లకు కొత్త కాంట్రాక్టర్ల నియామక ప్రక్రియ మార్చి 31 లోపు పూర్తి చేసేలా విధివిధానాలు రూపొందిస్తున్నారు.

ప్రకృతి విపత్తులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): ప్రజల భాగస్వామ్యంతోనే ప్రకృతి విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొగలమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ప్రకృతి విపత్తులు ఎదుర్కోవడం, ముందస్తు చర్యలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందంతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు ప్రకృతి విపత్తుల సమయంలో ఎలా వ్యవహరించాలో పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగినపుడు సంబంధిత వ్యక్తులు వచ్చేవరకు వేచి చూడకుండా తక్షణం అక్కడి ప్రజలే స్పందించి ఎదుర్కొనేలా అవగాహన ఉండాలన్నారు. జిల్లాలో ఆపదమిత్రలను ఎంపిక చేసి ట్రైనింగ్ పూర్తి చేశామన్నారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఎం. సూర్య తేజ డీఆర్‌ఓ కె.కృష్ణవేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం కమాండర్ వై.సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవాలు చేయాలి

గ్రామాల్లో గర్భిణులకు ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయం నుంచి మండల, పీహెచ్‌సీ స్థాయి వైద్యులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. హైరిస్క్ గర్భిణులను వారం రోజుల ముందే ఆసుపత్రికి తరలించాలని, ప్రతినెల పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు అందించాలన్నారు.

నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల గడువు పెంచినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎంవీ అవధాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 15 వరకు ఆన్‌లైన్‌లో అందించవచ్చని తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 29న పరీక్ష జరుగుతుందని వివరించారు. ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులో విద్యార్థుల వివరాల్లో ఏమైనా తప్పులుంటే వాటిని సవరించుకోవడానికి ఈ నెల 16, 17 తేదీల్లో ఎడిట్ ఆప్షన్ ఇస్తారన్నారు. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించాలని కోరారు.

50 జగనన్న కాలనీల్లో విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలోని వివిధ డివిజన్లలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీల్లోని 50 లేఅవుట్లలో మంగళవారం విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్నామని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్ రాజు తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 300 కాలనీల్లో విద్యుత్ సరఫరా చేస్తున్నామని, కాలనీల్లో నిర్మాణం పూర్తిచేసుకున్న అన్ని గృహాలకూ సర్వీసులు ఇస్తున్నామని వివరించారు. ఏలూరు డివిజన్‌లో ఎనిమిది లేఅవుట్లలోని 418 ప్లాట్లకు, భీమవరం డివిజన్‌లోని రెండు లేఅవుట్లలోని 37 ప్లాట్లకు విద్యుత్ అందిస్తామన్నారు. జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని నాలుగు లేఅవుట్లలో 92 ప్లాట్లకు, తాడేపల్లిగూడెంలోని 20 లేఅవుట్లలో 1687 ప్లాట్లకు, నిడదవోలు డివిజన్‌లోని ఏడు లేఅవుట్లలోని 2617 ప్లాట్లకు, నరసాపురం డివిజన్‌లోని తొమ్మిది లేఅవుట్లలో 919 ప్లాట్లకు మొత్తం 50 లేఅవుట్లలోని 5770 ప్లాట్లకు విద్యుత్ సరఫరా ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఒకేరోజు దాదాపు ఆరువేల ప్లాట్లకు విద్యుత్ సరఫరా చేయడం ఒక రికార్డుగా చెప్పుకోవచ్చని వెల్లడించారు. జిల్లాలో మిగిలి ఉన్న జగనన్న కాలనీల్లో సైతం త్వరితగతిన విద్యుదీకరణ పనులు పూర్తి చేయడానికి తమ యంత్రాంగం కృషి చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ఈపీడీసీఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) ఎం.ఝాన్సీ, ఈఈ (ఆపరేషన్స్) టి.శశిధర్, ఈఈ (కన్‌స్ట్రక్షన్స్) టి.వెంకటేశ్వరరావు, ఏలూరు ఆపరేషన్ టౌన్ డీఈఈ బీవీ కృష్ణ రాజా, రూరల్ డీఈఈ పి.ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

ఆటోలో పర్సు మరచిపోయిన మహిళ

పర్సులో రూ. 70వేలు, 25 కాసుల బంగారం

పోడూరు: ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ బంగారు నగలు, నగదుతో ఉన్న పర్సు మరచి పోయిన ఘటనపై మంగళవారం పోడూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల ప్రకారం యలమంచిలి మండలం కలగం పూడికి చెందిన చింతలపాటి వరలక్ష్మి సావిత్రి సోమవారం గుమ్మలూరుకు చెందిన మరో మహిళతో కలిసి గుమ్మలూరు నుంచి పెనుమదం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. పెనుమదం బ్యాంక్ సమీపంలో ఆటో దిగారు. వరలక్ష్మి సావిత్రి ఆటోలోనే తన పర్సును మరచిపోయింది. కొంతసేపటికి పర్సు గుర్తుకువచ్చి ఆమె మరో ఆటోలో పాలకొల్లు వైపు వెళ్లి గాలించారు. అయినా వారు ఎక్కిన ఆటో కనిపించలేదు. దీంతో బాధితురాలు సోమవారం రాత్రి పోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పర్సులో సుమారుగా 25 కాసుల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదు ఉన్నట్టు పేర్కొంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వై.నాగలక్ష్మి తెలిపారు.

పర్సు కొట్టేసిన దొంగ అరెస్ట్

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి): మహిళ చేతిలో పర్సు లాక్కొని పారిపోయిన దొంగను అరెస్ట్ చేసినట్లు జీలుగుమిల్లి ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం చెప్పారు. జీలుగుమిల్లి మండలం టి.రాజవరంలో ఒక మహిళ చేతిలో పర్సు లాక్కుని ఒక దొంగ పారిపోయాడు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అన్నారు. దొంగ జీలుగుమిల్లి పరిసర ప్రాంతంలోనే తిరుగుతున్నారనే సమాచారంతో నిఘాపెట్టగా దొంగ పట్టుబడినట్లు చెప్పారు. నిందితుడిని తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన అనిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశామని చెప్పారు.

ఉత్కంఠభరితంగా ఎస్‌పీఎల్

Regional Sponsor APMDC APMDC FOUNDATION

సాక్షి, భీమవరం: 'సాక్షి' మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలు ఐదో రోజు మంగళవారం ఉత్కంఠభరితంగా సాగాయి. మొదటి మ్యాచ్‌లో ఏలూరు సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్, పెనుగొండ ఎస్‌వీకేపీ అండ్ పీవీ జూనియర్ కాలేజి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎస్‌వీకేపీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 46 పరుగులు చేసింది. అనంతరం సీఆర్ రెడ్డి జట్టు 6 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 47 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి, 4 వికెట్ల తేడాతో విజయాన్ని నమోదు చేసింది.

SPL SAKSHI PREMIER LEAGUE

రెండో మ్యాచ్ భీమవరం ఆదిత్య జూనియర్ కళాశాల, ఏలూరు సర్ సీఆర్ రెడ్డి జూనియర్ కళాశాల జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సీఆర్ రెడ్డి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం ప్రత్యర్థిని 10 ఓవర్లలో 70 పరుగులకే కట్టడి చేసి విజయాన్ని అందుకుంది.

మూడో మ్యాచ్‌లో సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన స్వర్ణాంధ్ర జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 78 పరుగుల స్కోరు సాధించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడుతూ విజయం కోసం పోరాడాయి. ఛేదనలో ఏలూరు ఇంజినీరింగ్ కళాశాల 75 పరుగులు చేయడంతో 3 పరుగుల తేడాతో స్వర్ణాంధ్ర జట్టు విజయాన్ని కైవసం చేసుకుంది. చివరి బంతి వరకూ మ్యాచ్ ఉత్కంఠకు గురిచేస్తూ సాగింది.

SAKSHI సాక్షి SAKSHI DIGITAL MEDIA GROUP


మొదటి మ్యాచ్‌లో విజేతగా నిలిచిన ఏలూరు సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ జట్టు


రెండో మ్యాచ్ విజేత ఏలూరు సర్ సీఆర్‌రెడ్డి జూనియర్ కళాశాల జట్టు


మూడో మ్యాచ్ విజేత సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల జట్టు

గడపగడపకు సంక్షేమం


యలమంచిలి: చించినాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్


వీరవాసరం: బొబ్బనపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తూ ఓ వృద్ధుడిని ఆప్యాయంగా పలుకరిస్తున్న భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

జేఈఈ మెయిన్స్‌లో శశి వేలివెన్ను హవా


డీబీ అక్షయ్


ఆర్‌వీ శ్రీరామ వరుణ్


సీహెచ్ వెంకట సాయి


జీవీ సత్యకృష్ణ


జె.నాగేంద్రకుమార్

ఉండ్రాజవరం: జేఈఈ మెయిన్–2023 ఫలితాలల్లో తమ విద్యార్థులు మరోసారి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారని వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ మంగళవారం చెప్పారు. డీబీ అక్షయ్ 99.80, ఆర్‌వీ శ్రీరామ వరుణ్ 99.79, సీహెచ్.వెంకటసాయి 99.77, జీవీ సత్యకృష్ణ 99.73, జె.నాగేంద్రకుమార్ 99.69, బీవీ విక్షిత్ 99.67, పి.గంగామనోహర్ 99.66, జి.మోక్షజ్ఞ 99.62, ఎం.ఉమామహేశ్వరరావు 99.61, కె.రోహిత్‌కుమార్ 99.52, పి.జయచరణ్ 99.46, ఎస్.లక్ష్మీ ప్రవల్లిక 99.45, టి.మోహిత్ చౌదరి 99.42, ఎం.మోహన్ సాయి రామ్ 99.41, డీఈఎస్.ఆదర్శవర్మ 99.27, ఏఎస్ఎస్.జశ్వంత్ 99.25, డి.నితిన్ 99.25 , యూసీహెచ్ చందన 99.20, కె.చంద్రశేఖర్ 99.19, వై.సాయి కౌషిక్ 99.07, పి.శ్రీనివాసు 99.02 పర్సంటైల్ సాధించినట్లు ఆయన తెలిపారు. 99 పర్సంటైల్ పైన 21 మంది, 98 పైన 41 మంది, 95 పైన 98 మంది, 90 పర్సంటైల్ పైన 205 మంది సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శశి విద్యాసంస్థల వైస్ చైర్మన్ బూరుగుపల్లి లక్ష్మీసుప్రియ అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీ షిర్డీసాయి ముందంజ


జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ కనపర్చిన షిర్డీసాయి విద్యార్థులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య మంగళవారం తెలిపారు. తమ లక్ష్యా ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందిన జీఎస్ ఆదిత్య, డి.జయప్రకాష్ 99.9 పర్సంటైల్ సాధించగా, సీహెచ్ మాన్విత 99.7, జైదీప్ శ్రీవాస్ 99.6, సీహెచ్ సాయిచరణ్ 99.3 పర్సంటైల్ సాధించి ప్రతిభ కనపరచారన్నారు. మొత్తం ఐదుగురు విద్యార్థులు 99 పైగా పర్సంటైల్ సాధించగా, 8 మంది 98కి పైగా, 17 మంది 97కు పైగా, 42 మంది 95కు పైగా పర్సంటైల్ సాధించారన్నారు. మొత్తం 207 మంది విద్యార్థులు హాజరుకాగా 153 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. వీరిలో 109 మంది వివిధ ఎన్ఐటీలలో సీట్లు సాధించగలరని విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని ఆయన అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

తణుకు: తణుకు మండలం తేతలి వైజంక్షన్ సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువతికి గాయాలయ్యాయి. తాడేపల్లిగూడెం వైపు నుంచి స్కూటీపై వస్తున్న యువతి ఒక మోటారుసైకిల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు బాధితురాలిని ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతిని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Services

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2283]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786671]

ASTROLOGY

■ తాళపత్రములు చూసి మీ బొటన వేలి ముద్రతో మీ పేర్లు, మీ కుటుంబ సభ్యుల పేర్లు మీ భవిష్యత్తు, మీ సమస్యలు వాటి పరిష్కారాలు చెప్పబడును. విజయవాడ. ✆ 83176 84903 [B-786670]

ఆయుర్వేదం

■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర: 9603055647, 7995392747 [G-971]

Wanted

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779887]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190567]

■ కైకలూరు మరియు పరిసర ప్రాంతాలలో పని చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డులు కావలెను. Contact: 98667 93288 [B-786671]

హరేకృష్ణ హోంకేర్ విజయవాడలో వృద్ధులను / పేషెంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు (M/F) కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం16,000/- ✆ 96405 28899, 96406 48899 [B-843]

■ NRI తల్లిదండ్రులను, వృద్ధులను వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు, ఆయాలు, కేర్‌టేకర్స్ M/F హెల్పర్లు కావలెను. Salary 14-20K వసతి + భోజనం కలదు. ✆ 91608 35559, 78158 35561 [B-834]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp Dr, Q: 5th- డిగ్రీ. 10-30 వేలు జీతం, భో+రూ ఫ్రీ, Hyd, Ph: 7995984445 [HA-936]

■ బ్యాంకింగ్ అనుబంధ సంస్థనందు ఏలూరులో పనిచేయుటకు D.M/T.L/Asst కావలెను. స్త్రీ/పు, Age: 20 to 70 Y పార్ట్‌టైమ్ / ఫుల్‌టైమ్ Salary/ Incentive/ Insurance /ESI & P.F ఇవ్వబడును. ✆ : 73969 82204 [R-5570]

■ JOB VACANCY. Age 18 to 45, 10th to Any Degree, Office job 18000 to 25000, Work from home 15000 to 18000, ✆ 8978521315. [T-831]

■ శ్రీ పాండురంగ మెగా ఐస్ క్రీమ్ పార్లర్ (జ్యూస్ షాపు)లో ప॥గో॥ పాలకొల్లుటౌన్ లో పనిచేయుటకు హెల్పర్స్ యువకులు కావలెను. (ఫ్యామిలీ అయినా వసతి కలదు) జీతం+వసతి+భోజనం+ టిఫిన్+టీ ఫ్రీ. ఫోన్: 9848621376 [HA-960]

■ వివిధ విమానాశ్రయాలలో ఉద్యోగాలుకలవు. 10th /ఇంటర్ ఆపై చదివిన వారికి 6నెలలు ట్రైనింగ్ సర్టిఫికెట్ మరియు ఉద్యోగం ఇవ్వబడును. జీతం: 12,000/- నుంచి 15,000/- వయసు 18-26 సం॥ వరకు మాత్రమే సంప్ర॥ ✆ 74162 45238. [O-786968]

■ హైదరాబాదులో మా ఇంట్లోనే ఉండి 3 సం॥లు పాప పనులు చేయుటకు ఒక స్త్రీ మరియు ఇంటి పనులు చేయుటకు ఒక స్త్రీ కావలెను. ఏ బాదర బందీ లేని 20 నుండి 45 సం॥లు వయస్సు గలవారు కావలెను. ✆ : 73968 44153, 88865 50044 [R-413]

Advertise in Classifieds
Rs. 350/- for 4 lines only
Additional Line Rs. 85/-
Best & Affordable Schemes also available.
Automobile
Education
Real Estate
Services
Wanted
సాక్షి
చిరునామా: సాక్షి బిల్డింగ్స్, సర్వే నెం.108/6, ప్రత్తిపాడు గ్రామం, తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్రికెట్ గురించి తాజా సమాచారానికి, రచనలకు www.sakshi.com సాక్షి స్పోర్ట్స్

వీఐపీల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- సమయస్ఫూర్తితో విధులు నిర్వర్తించాలి
- ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ
- పెదవేగి డీటీసీలో పీఎస్‌ఓలకు ముగిసిన శిక్షణ


పీఎస్‌ఓలతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

పెదవేగి: వీఐపీ, వీవీఐపీల భద్రతపై పర్సనల్ సెక్యూరిటీ అధికారులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు పెదవేగి పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ, కృష్ణా, కోనసీమ జిల్లాలకు సంబంధించిన పర్సనల్ సెక్యూరిటీ అధికారులకు శిక్షణ ఇచ్చారు. మంగళవారం శిక్షణ ముగింపు సందర్భంగా ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణలో నేర్చుకున్న అంశాలపై ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్సనల్ సెక్యూరిటీ అధికారుల విధులు చాలా ప్రాముఖ్యతతో కూడుకున్నవని, వీఐపీ, వీవీఐపీల భద్రత కోసం ఉద్యోగ నిర్వహణలో పాటించాల్సిన విధివిధానాలను వివరించారు. అధికారులు అలసత్వం లేకుండా విధులు నిర్వర్తించాలని, ఏదైనా ఉపద్రవం ఏర్పడితే సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకుంటూ వీవీఐపీలకు ఏ విధమైన ఆటంకాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ ఆశీర్వాదం మాట్లాడుతూ రానున్న జి20 సమావేశాల రక్షణకు అనుగుణంగా 26 జిల్లాలలో ఉన్న పర్సనల్ సెక్యూరిటీ అధికారులకు పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని ఇంటెలిజెన్స్ డీజీపీ ఆదేశాల మేరకు ఇప్పటివరకు 21 జిల్లాలలో 1,224 మందికి శిక్షణ పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ శిక్షణా కాలంలో అవుట్ డోర్, ఇండోర్ అంశాలపై సిబ్బందికి పూర్తి స్థాయిలో తర్ఫీదు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు విజయనగరం, కల్యాణ్ డ్యామ్, ఒంగోలు వివిధ డీటీసీలలో, పీటీసీ అనంతపురంలో, పెదవేగి డీటీసీలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ శిక్షణలో ఆయుధాల వినియోగం, వీఐపీ, వీవీఐపీల రక్షణ అంశాలపై అవగాహన కల్పించామన్నారు. పెదవేగి డీటీసీ డీఎస్పీ కె.ప్రభాకర్‌రావు, ఏఆర్‌డీ డీఎస్పీ కృష్ణంరాజు, ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ మోహన్‌రావు, ఆర్ఎస్సై ఎం.గంగాధర్‌బాబు, ఏఆర్ ఆర్ఎస్సై వెంకటేష్, హెచ్‌సీ వి.రాజేష్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్సై విజయ్ కుమార్, ఏఎస్సై రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైనాట్‌కు బ్లూస్టార్ గోల్డెన్ అవార్డు



తణుకులో అవార్డు అందుకుంటున్న వైనాట్ అధినేత రాయుడు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్‌కు ప్రముఖ ఏసీ ఉత్పత్తుల సంస్థ బ్లూస్టార్ గోల్డెన్ అవార్డు దక్కింది. చెన్నై లీలా ప్యాలెస్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వైనాట్ గ్రూప్ సంస్థల అధినేత జుజ్జవరపు వెంకటరాయుడుకి బ్లూస్టార్ మేనేజింగ్ డైరెక్టర్ బి.త్యాగరాజన్, అధ్యక్షులు శశి అరోరా చేతుల మీదుగా అవార్డు అందజేశారు. దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో చైన్ స్టోర్ డివిజన్‌లో పవర్ రిటైలర్ విభాగంలో ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు, సిబ్బందికి రాయుడు అభినందనలు తెలిపారు.

10న తణుకులో మెగా జాబ్ మేళా

తణుకు: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో తణుకు చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 10న మెగా జాబ్ మేళా జరుగుతుందని నిర్వాహకులు పార్థసారథి, కృష్ణారెడ్డి మంగళవారం చెప్పారు. జాబ్‌మేళాలో సుమారు 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొని సుమారు 580 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 ఏళ్ల లోపు కలిగిన అభ్యర్థులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఇతర వివరాలకు 70138 96277, 99888 53335 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

శ్రీవారి ఆలయానికి నూతన ట్రస్టుబోర్డు ఏర్పాటు


చైర్మన్ ఎస్వీ.సుధాకరరావు.

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో ఒకటైన ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయానికి నూతన ట్రస్టుబోర్డును ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్వీ సుధాకరరావుతో పాటు, రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన మరో 14 మంది సభ్యులకు ఈ ట్రస్టుబోర్డులో అవకాశం కల్పించారు. ఈ ఆలయానికి 2011లో తొలిసారిగా ఏర్పాటైన ట్రస్టుబోర్డు 2013 వరకు కొనసాగింది. ఆ తరువాత చట్టపరిధిలోని అంశాలకు లోబడి టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ట్రస్టుబోర్డు నియామకాన్ని నిలిపివేసింది. అయితే వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 2020లో రాష్ట్రంలోని అన్ని ప్రధాన ఆలయాలతో పాటు ఈ ఆలయానికి ట్రస్టుబోర్డును ఏర్పాటు చేసింది. వాటి పదవీకాలం (రెండేళ్లు) పూర్తికావడంతో కొత్త నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వులిచ్చింది.

ట్రస్టు బోర్డు సభ్యులు వీరే..

ట్రస్టుబోర్డు సభ్యులుగా నాళ్లం కృష్ణవీర సుబ్బలక్ష్మి (రాజానగరం మండలం పాలచర్ల), చిట్టూరి మణి (కొవ్వూరు), ముస్సే శ్రీను (పెదవేగి మండలం వేగివాడ), పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ (ద్వారకాతిరుమల), మానుకొండ సుబ్బారావు (ద్వారకాతిరుమల మండలం సత్తెన్నగూడెం), తానంకి గంగరాజు (గోపాలపురం మండలం పెద్దాపురం), పాయం మంగతాయారు (గోపాలపురం మండలం బుచ్చింపేట), ముప్పిడి సంపత్‌కుమార్ (తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం), నూకాల అమ్మాజీ (ఏలూరు), పాల వెంకటేశ్వరరావు (అగ్రహారం మండలం కొత్తపల్లి), బోడపాటి దేవిమౌనిక (తణుకు మండలం మండపాక), ఆచంట అనసూయ (దేవరపల్లి మండలం చిన్నాయిగూడెం), గుర్రం సూర్యావతి (రాజమండ్రి), వాసా రామకృష్ణ (జంగారెడ్డిగూడెం) నియమితులయ్యారు. కొత్త పాలకవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం గురువారం నిర్వహిస్తామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు మంగళవారం చెప్పారు.

यूनियन बैंक Union Bank of India Andhra Corporation

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రాంతీయ కార్యాలయం, భీమవరం, ప.గో.జిల్లా

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002లోని రూల్ 8(6) నిబంధనలతో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఈ వేలం అమ్మకం నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు 30 రోజుల అమ్మకం నోటీసు

[illegible] యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా [illegible] తేది.10.03.2023 ఆన్‌లైన్ ఈ-వేలం ద్వారా అమ్మకం చేయుటకు నిర్ణయించినారు. [illegible]

పాలకొల్లు బ్రాంచ్ ఫోన్ : 08814-224482

1) ఋణగ్రహీతల పేరు & చిరునామా : [illegible] పాలకొల్లు–534260, పశ్చిమ గోదావరి జిల్లా. [illegible] హామీదారు : శ్రీ [illegible] 20-3/13-2, [illegible] వార్డు నెం.9, పాలకొల్లు – 534260, పశ్చిమ గోదావరి జిల్లా. బకాయి మొత్తం : రూ.53,95,115.74 పై. + వడ్డీ మరియు ఇతర ఖర్చులు. స్థిరాస్తి వివరములు : పాలకొల్లు, [illegible] వార్డు నెం.9, డి.నెం.20-3-13/2 [illegible] 97.00 చ.గ.లు [illegible] హద్దులు : ఉత్తరం : [illegible], తూర్పు : [illegible], దక్షిణం : మున్సిపల్ రోడ్డు, పడమర : [illegible]
రిజర్వు ధర : రూ.64,71,000/- ధరావత్తు : రూ.6,47,100/-

2) ఋణగ్రహీతల పేరు & చిరునామా : శ్రీ కొట్టు నరసింహమూర్తి, తండ్రి : [illegible], డి.నెం.2-5-13/1, అన్నపూర్ణ థియేటర్, [illegible] పశ్చిమ గోదావరి జిల్లా. హామీదారు : శ్రీమతి కొట్టు చంద్రకాంతి, భర్త : నరసింహమూర్తి, డి.నెం. 2-5-13/1, అన్నపూర్ణ థియేటర్ దగ్గర, [illegible] పశ్చిమ గోదావరి జిల్లా. బకాయి మొత్తం : రూ.39,13,824.01 పై. + వడ్డీ మరియు ఇతర ఖర్చులు. స్థిరాస్తి వివరములు : [illegible] డి.నెం.2-5-13/1 [illegible] హద్దులు : ఉత్తరం : [illegible] – 52'.00", తూర్పు : మున్సిపల్ రోడ్డు – 22'.30". దక్షిణం : [illegible] – 52'.00". పడమర : మున్సిపల్ డ్రైనేజ్ & [illegible] – 22'.90".
రిజర్వు ధర : రూ.50,25,000/- ధరావత్తు : రూ.5,02,500/-

ఇ-వేలం తేది మరియు సమయం: 10-03-2023 మ.1.00 గం.నుండి సా.5.00 గం.వరకు (10 నిముషాల అపరిమిత కాల పొడిగింపుతో)

ఇ-వేలమునకు సంబంధించిన తదుపరి వివరములు సవివరమైన నియమ నిబంధనలు కొరకు దయచేసి https://ibapi.in లింక్‌ను సందర్శించగలరు. (బ్యాంకు యొక్క ఆస్తుల ఉమ్మడి ప్లాట్ ఫారం) మరియు www.unionbankofindia.co.in వెబ్‌సైట్ సందు అభిస్తాయి. మరియు ఇ-వేలం పోర్టల్: www.mstcecommerce.com ఈ ప్రకటన పై లోనుకు సంబంధించిన ఋణగ్రహీత(ల)కు, హామీదారు(ల)కు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) రూల్ 9(1)ల క్రింద పైన తెలిపిన తేదీన వేలం అమ్మకం జరుపబడునని తెలియజేస్తూ ఇచ్చిన ప్రకటనగా కూడా పరిగణించవలెను.

తేది : 07-02-2023, ప్రదేశం : భీమవరం సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా

కొట్టుకు కృతజ్ఞతలు



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: వైఎస్సార్ సీపీకి సేవలందించిన నాయకులకు, పార్టీ కార్యకర్తలకు ఉన్నతస్థానం కల్పించడం పట్ల ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలుపుతున్నామని ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వరరావు దేవస్థానం పాలక మండలి సభ్యుడు ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను పూలమాలలు, దుశ్శాలువాలతో మంగళవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పానుకుమాటి శేషులత, జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, బొద్దాని శ్రీనివాస్ తదతరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

తాడేపల్లిగూడెం: సమగ్ర కులగణన జరగాలని స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం బీసీ చైతన్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు కోరారు. సమావేశానికి చిటికెన ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ నెల 11న విస్తృత సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వీరవల్లి శ్రీనివాసు, గొర్రెల శ్రీనివాసు, అడ్డాల నరసింహారావు, ముద్రగడ లలితాదేవి, చింతకాయల సత్యనారాయణ, సెల్లారపు రాంబాబులు పాల్గొన్నారు.

యూసీప ఆధ్వర్యంలో జాన్సన్‌కు ఘన సత్కారం



తణుకులో జాన్సన్‌ను సత్కరిస్తున్న యూసీప నాయకులు

తణుకు: ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ మేడిది జాన్సన్ మంగళవారం తణుకులో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ సేవకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా మున్సిపాల్టీల్లో చర్చిల అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నామని ఇందుకోసం త్వరలో కొత్త జీవో విడుదలకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు మల్లిపూడి ప్రేమ్‌కుమార్, అధ్యక్షుడు ఒ.మనోజ్‌బాబు, ఉపాధ్యక్షుడు కె.లాజరస్‌బాబు, కార్యదర్శి కె.బ్లెస్సింగ్‌రాజు, కె.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి



మాట్లాడుతున్న గూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు

తాడేపల్లిగూడెం: భారత అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ నెల 11న నిర్వహించనున్న జాతీ య లోక్ అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు కోరారు. ఈమేరకు మంగళవారం విలేకర్లకు వివరాలు చెప్పారు. రాజీపడాల్సిన సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఆస్తి తగాదాలు, రాజీ చేసుకోవాల్సిన కేసులు, చెక్‌బౌన్సు కేసులు, భార్యాభర్తల తగాదాలు, మోటారు యాక్సిడెంటు కేసులు కూడా రాజీ చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టు మెషీన్ల పంపిణీ

సాక్షి, భీమవరం: పేద మహిళల అభివృద్ధికి రాజ్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 11వ వార్డు రాజ్ ట్రస్ట్ కార్యాలయంలో 15 మంది దళిత మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రామభాయి అంబేడ్కర్ 126వ జయంతి సందర్భంగా రాజ్ ట్రస్ట్ ఫౌండర్ గంటా రాజ్‌కుమార్ ఇటువంటి సేవాకార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.సైమాన్, పాలపర్తి జోనా, డి.సతీష్, సాదె మహేష్ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- జట్లపాలెంలో మూడో రోజు గడపగడపకు మన ప్రభుత్వం



గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పథకాలు వివరిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్నివర్గాల సంక్షేమం సాధ్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జట్లపాలెం గ్రామంలో మూడోరోజు పలు వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రజారంజక పాలన సీఎం జగనన్నతోనే సాధ్యపడుతుందన్నారు. సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి జగన్‌కు రెండు కళ్లలాంటివన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ముఖ్యమంత్రికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పారదర్శకతకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులు పెట్టారన్నారు. జన్మభూమి కమిటీ లంటూ పథకాల్లో కోత విధించారన్నారు. పంచాయతీ పనులు చేయనివ్వకుండా, అభివృద్ధి చేసిన వాటికి బిల్లులు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెట్టడం ప్రజలు గమనించారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నట్లు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తెలుస్తోందన్నారు. నేడు ప్రతి వ్యక్తికి జవాబుదారీగా ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచిన అన్ని వాగ్దానాలు అమలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు పలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో గ్రామంలో టీడీపీ నాయకులు చంద్రబాబులా దోచుకోవడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. పేదలకు పలు పథకాలతో పాటు, అందరికి ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఇళ్లతో పాటు, సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్యసెంటర్, ఇతర భవనాలు ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామీణ పాఠశాలలు నాడు - నేడు పనుల్లో భాగంగా కోట్లాదిరూపాయలు అందించడంతో పాటు, విద్యార్థులకు పౌష్టికాహారలోపం లేకుండా జగనన్న గోరుముద్ద ప్రత్యేక మార్పులు చేసి అందిస్తున్నారన్నారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, వైఎస్సార్ సేవాదళ్ మండల కన్వీనర్ సంపతరావు కృష్ణారావు, సొసైటీల అధ్యక్షుడు గుండుమోగుల సాంబయ్య, మైలవరపు పెదబాబు, బూరాడ శ్రీనివాస్, సర్పంచ్ మణిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి, పార్టీజిల్లా కార్యదర్శి విజయానందరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ జామి కృష్ణ, వ్యవసాయ సలహామండలి మండల అధ్యక్షులు కె. కృష్ణప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, మట్టా సత్యనారాయణ, పొట్ల ఏడుకొండలు, తహసిల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో దామోదరరావు, అడ్వకేట్ సిహెచ్ ఇజ్రాయేల్ రాజు, పలు శాఖల ఏఈలు, సిబ్బందితో పాటు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో మేలు



జగన్నాథపురం సచివాలయం-2 పరిధిలో భూమి రీ-సర్వే చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: భూసమస్యల పరిష్కారానికి రీ సర్వే కార్యక్రమం ఉపకరిస్తుందని ల్యాండ్ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆర్.అన్నపూర్ణ తెలిపారు. జగనన్న భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ అన్నపూర్ణ మాట్లాడుతూ భూమి రీ-సర్వే ద్వారా కచ్చితమైన హద్దులు వస్తాయన్నారు. దీనివల్ల భవిష్యత్‌లో ఎటువంటి సరిహద్దు తగాదాలు ఉండవన్నారు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పానుకుమాటి గౌరి, ఉప సర్పంచ్ గూడవల్లి శ్రీనివాస్, మండల సర్వేయర్ ఎస్.చక్రవర్తి, సచివాలయ కార్యదర్శి జడ్డు ఫణీంద్రకుమార్, వీఆర్వో ఎస్.నాగరాజు, దుర్గాప్రసాద్, టెక్నికల్ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారమే ధ్యేయం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి
- 17వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



తణుకులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకొని, పరిష్కరించడమే గడపగడపకు మన ప్రభుత్వం ఉద్దేశ్యమని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 17వ వార్డులో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని మాట్లాడారు. ఏ ప్రాంతంలోనైనా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గడపలోను సీఎం జగన్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్న తీరు చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంతటి ప్రజాదరణ పొందిన ఏకైక వ్యక్తిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడతారని స్పష్టం చేశారు. ముఖ్యంగా పింఛనుదారులైతే వారికి వలంటీరు వ్యవస్థ ద్వారా పింఛను అందుతున్న తీరును ఆస్వాధిస్తున్నారని అన్నారు. పింఛను పంపిణీ కోసం మా ఇంటి బిడ్డలా తెల్లవారుజామునే మమ్మల్ని నిద్రలేపి డబ్బులు చేతుల్లో పెడుతున్నారంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ప్రజానీకం స్థానికంగా ఉన్న సమస్యలను మంత్రి కారుమూరి దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఎస్.నాగేశ్వరరావు, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, విద్యుత్ శాఖ డీఈఈ సీహెచ్ రామకృష్ణ, మునిసిపల్ ఏఈ రామకిషోర్, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఎస్సీసెల్ తణుకు మండల అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉండవల్లి జానకి, కర్రి కాశీరెడ్డి, వార్డు నాయకులు కట్టా కిషోర్, మండా సూరిబాబు, అడ్డాల రామకృష్ణ, రాచమల్ల సత్యనారాయణ, కామన ఈశ్వరరావు, సింహాద్రి రాజేష్, అంబుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పలు దేవస్థానాలకు బోర్డు మెంబర్లుగా నలుగురు నియామకం



మారం వెంకటేశ్వరరావు



కొలుకులూరి రామసీత



ముప్పిడి సంపత్ కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్: రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాలకు తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి కొందరు బోర్డు మెంబర్లుగా నియమించినట్లు ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ మంగళవారం వెల్లడించారు. విజయవాడ దుర్గామల్లేశ్వరి దేవస్థానం బోర్డు మెంబర్లుగా కొలుకులూరి రామసీత, మారం వెంకటేశ్వరరావు, అన్నవరం శ్రీ రమాసత్యనారాయణ స్వామి వారి దేవస్థానం బోర్డుమెంబరుగా బొద్దాని వెంకటలక్ష్మి, ద్వారకాతిరుమల శ్రీవేంకేశ్వరస్వామి దేవస్థానం బోర్డు మెంబరుగా ముప్పిడి సంపత్‌కుమార్‌లు నియమితులయ్యారు. వీరందరూ త్వరలో ప్రమాణస్వీకారం చేయనున్నారు. మంత్రి కొట్టు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సముచిత స్థానం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాలకు బోర్డుమెంబర్లను నియమించడమే నిదర్శనమన్నారు. ఇచ్చిన హామీలను తు.చ తప్పకుండా జగన్ అమలు చేస్తున్నారన్నారు. దేవస్థానాలకు బోర్డు మెంబర్లుగా తాడేపల్లిగూడెం నుంచి అన్నివర్గాలకు చెందిన వ్యక్తులను నియమించడం సంతోషకరమన్నారు. నూతనంగా నియమితులైన బోర్డు మెంబర్లను కలిసి పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

వేగ నియంత్రణతో ప్రమాదాల నివారణ



హెల్మెట్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ తదితరులు



తణుకులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ ఆంజనేయులు

పెంటపాడు: వాహనాలు నడిపేటప్పుడు వేగ నియంత్రణతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని ఎస్సై జి. సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పెంటపాడు సెంటర్‌లో ప్రయాణికులకు హెల్మెట్ వాడకంపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. భీమవరం- గూడెం రహదారిపై హెల్మెట్ లేకుండా ద్విచక్రాలపై వచ్చే, వెళ్లే వాహనదారులను ఆపి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై కొప్పిశెట్టి సత్యనారాయణ, హెచ్‌సీ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

తణుకు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు కోరారు. తణుకు మండలం పైడిపర్రు సెంటర్ వద్ద మంగళవారం రాత్రి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవలి కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో కేవలం తలకు గాయం కావడం వల్లనే 60 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. తణుకు రూరల్ ఎస్సై కె.గుర్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రైతాంగానికి ఉపయుక్త ప్రయోగాలు రావాలి



శాస్త్రీయ సలహా సంఘ సమావేశంలో ప్రదర్శించిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన వర్సిటీ వీసీ జానకీరామ్

తాడేపల్లిగూడెం: రైతాంగానికి ఉపయుక్త ప్రయోగాలు రావాలని, పంటలను ఆశించే తెగుళ్ల నివారణ వంటి విషయాల్లో శాస్త్రీయ సలహా సంఘం సరైన మార్గనిర్దేశనం చేయాలని మంగళవారం ఉద్యానవర్సిటీలోని కృషి విజ్ఞానకేంద్రంలో జరిగిన శాస్త్రీయ సలహా సంఘ సమావేశంలో ఉద్యానవర్సిటీ వీసీ టి.జానకీరామ్ కోరారు. ఉద్యాన, వ్యవసాయ, పశు పోషణ, మృత్తిక శాస్త్రం, మత్స్యశాస్త్రవిభాగ శాస్త్రవేత్తలు 2022-23 సంవత్సరానికి నిర్వహించిన కార్యక్రమాల ప్రగతిని నివేదించారు. వ్యవసాయ సాంకేతిక పరిశోధన ప్రయోగసంస్థ (హైద్రాబాద్)కు చెందిన డాక్టర్ ఏఆర్.రెడ్డి రానున్న సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. కెవికెల ద్వారా అందించవలసిన సాంకేతిక సహకారం గురించి చర్చించారు. రైతులకు, మహిళలకు నాబార్డు సమన్వయంతో నిర్వహించే శిక్షణ, అభివృద్ధి కార్యక్రమాల గురించి నాబార్డు డీడీఎం టి.అనిల్‌కాంత్ వివరించారు. కెవికె ద్వారా అందించే కార్యక్రమాల గురించి విస్తరణ సంచాలకులు ఇ.కరుణశ్రీ,, శాస్త్రవేత్తలు షాలిరాజు, దీప్తి, ప్రసాద్‌రెడ్డి, విజయనిర్మల, రాఘవేంద్రరెడ్డి, వెంకటసతీష్‌లు తెలియచేశారు. వ్యవసాయ డ్రోన్ల పథకంలో కెవికె కొనుగోలు చేసిన డ్రోన్‌ను వీసీ ప్రారంభించారు. ఆర్యా కార్యక్రమం ద్వారా లబ్ధిపొందిన వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

తాడేపల్లిగూడెం: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు కనీసవేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పీఎఫ్, గ్రాడ్యుటీ, బీమా సదుపాయాలను అమలు చేయాలని అపరాలు, ఫ్లోర్‌మిల్లు జట్టు వర్కర్సు యూనియన్ (సీఐటీయు అనుబంధం) 37వ వార్షికోత్సవ సమావేశంలో మంగళవారం నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జేఎన్‌వి.గోపాలన్, కార్యదర్శి కర్రి నాగేశ్వరరావులు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. జాతీయవాదం పేరుతో అదాని మోసాలకు పాల్పడుతున్నా కేంద్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. 2023 ఏప్రిల్ 5వ తేదీన జరుగనున్న రైతు, కార్మిక సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా కరెడ్ల రామకృష్ణ, అధ్యక్షుడిగా గొన్నాబత్తు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా చిటికిన రాము,ప్రధాన కార్యదర్శిగా సర్మాల నారాయణరావు, కోశాధికారిగా అగుర్తుల రామ్మోహనరావు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

భవిష్యత్ ప్రకృతి వ్యవసాయానిదే



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు

ఆకివీడు: రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులు మరింత ఆసక్తి చూపుతారని ఏపీ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వై.నూకరాజు అన్నారు. మండలంలోని పెదకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత రెండు రోజులుగా ప్రకృతి పంటలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ మోడల్ కిచెన్ గార్డెన్‌ను తయారు చేసి ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి మొక్కలు సహజసిద్ధంగా ఎలా పెంచుకోవాలని వివరించారు. విద్యార్థులతో జీవామృతం తయారు చేయించారు. ఆకురసాలను తయారు చేసి ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ ఎం.అరుణకుమారి, జోనల్ కో-ఆర్డినేటర్ జీ.వెంకటరత్నం, డివిజన్ కో-ఆర్డినేటర్ ఆర్.రమణమ్మ, రమేష్, పాల్గొన్నారు.

హమాలీలకు సమగ్ర చట్టం చేయాలి

తాడేపల్లిగూడెం: హమాలీలకు సమగ్ర చట్టం చేయాలని మంగళవారం జరిగిన ఉల్లిపాయల మార్కెట్టు జట్టు కార్మికుల సర్వసభ్య సమావేశంలో నాయకులు డిమాండ్ చేశారు. సమావేశానికి చల్లా చంద్రరావు అధ్యక్షత వహించారు. సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు మార్పు, రైతు వ్యతిరేక విధానాలు, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నిధులు కోత వంటి సమస్యలపై ఏప్రిల్ 5న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో అల్లు సుబ్బారావు, బంకురు నాగేశ్వరరావు, కేదిరెడ్డి అప్పన్న, గొర్రెల శ్రీను, కరక వెంకట్రావు, గంటా కోటి, సిరపు గణేష్ , మతల అచ్యుతరావు, వర్రి జోగి, బేత అప్పారావు కార్మికులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను శుభ్రం చేయించకపోతే చర్యలు

తణుకు: పట్టణంలోని మున్సిపల్ పరిధిలో ఖాళీ స్థలాల్లో యజమానులు పిచ్చిమొక్కలను తొలగించుకోవాలని, మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని ఇన్‌ఛార్జి కమిషన్ నాగేశ్వరరావు తెలిపారు. మురుగునీరు కారణంగా దోమలు వ్యాప్తి చెంది పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురి అవుతున్నారని చెప్పారు. ఉల్లంఘించిన వారిపై మున్సిపల్ చట్టం 1965 సెక్షన్ 247, 248 ప్రకారం మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించి ఖర్చును యజమానుల నుంచి వసూలు చేస్తామన్నారు. స్పందించకపోతే సంబంధిత స్థలాలు మున్సిపాల్టీ స్వాధీనం చేసుకుంటుందని కమిషనర్ హెచ్చరించారు.

భవిష్యత్తులో గ్రీన్ ఎనర్జీ వాహనాల హవా



జ్యోతి ప్రజ్వలన చేసి విద్యుత్ 2కే 23 ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ తదితరులు

నరసాపురం రూరల్: భవిష్యత్‌లో గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ వాహనాల హవా కొనసాగుతుందని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కేవీ సత్యనారాయణ పేర్కొన్నారు. నరసాపురం మంగళవారం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్ ఈ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ 2కే 23 ఫెస్ట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. కళాశాల కోశాధికారి కొండవీటి త్రినాద్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఉపయోగపడే పరిశోధనలు చేయాల్సి అవసరం ఉందన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన ర్యాలీ



జంతు సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాంశచౌక్): జంతువులను ప్రేమించడం, ఆదరించడం భగవంతుడి సేవతో సమానమని, శారీరక ప్రక్రియ ప్రతి జీవికి జంతువులకు ఒక్కటేనని జిల్లా పశు సంవర్థక శాఖ ఏడీ జి.సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ జంతు సంక్షేమ సంఘం, భీమవరం పశువుల ఆసుపత్రి ఆధ్వర్యంలో జంతు సంక్షేమ అవగాహన కార్యక్రమాన్ని స్థానిక పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ జంతు ప్రేమికులు తమ పెంపుడు జంతువులు మరణిస్తే మానసికంగా కుంగిపోతున్నారని, జంతువులను ప్రేమించాలన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జంతువుల పరిరక్షణపై ప్రసంగించారు. అనంతరం ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కోడె వెంకటరావు, సుంకర దాసు విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

తాడేపల్లిగూడెం అర్బన్: బీసీ వర్గాలకు ఉన్నత స్థానం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు పటాన్ల గణపతి కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానాల పాలక మండలిలో మెంబర్లుగా సముచిత స్థానం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నామని గణపతి అన్నారు. స్థానిక పోలీస్‌ఐలాండ్ వద్ద జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయీ బ్రాహ్మణుల కార్పొరేటషన్ డైరెక్టర్ పట్నాల గౌరీ గణపతి, టి నర్సింహమూర్తి, శ్రీహరి, బాబు, శ్రీను, మురళీకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

వేండ్రలో నాన్ లేఅవుట్‌లపై విచారణ



నాన్ లే అవుట్ లను పరిశీలిస్తున్న పాలకొల్లు, మొగల్తూరు ఈవోపీఆర్డీలు అమీర్ షరీఫ్, నవీన్‌లు

పాలకోడేరు: వేండ్రలో నాన్ లేఅవుట్ స్థలాల్లో నిర్మాణాల జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం డీపీఓ నాగలత ఆదేశాల మేరకు పాలకొల్లు, మొగల్తూరు ఈవోపీఆర్డీలు అమీర్ షరీఫ్, నవీన్ విచారణ చేశారు. గ్రామానికి చెందిన కడలి దుర్గారావు నాన్ లేఅవుట్ స్థలాల్లో అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేశారు. కొన్నిచోట్ల తనిఖీలు చేసి రికార్డు చేసుకున్నారు. వీరి వెంట పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి అమిజాల పోలయ్య, వీఆర్వో అలేఖ్య ఉన్నారు.

నాయీ బ్రాహ్మణుల హర్షం

పెనుగొండ: రాష్ట్రంలో ప్రతి దేవస్థానం ట్రస్టు బోర్డులో తప్పని సరిగా నాయీ బ్రాహ్మణులను ట్రస్టీగా స్థానం కేటాయించా లని సీఎం జగన్ ఆర్డినెన్స్ తీసుకురావడం అభినందనీయమని నాయీ బ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు కట్టుంగ శ్రీమన్నారాయణ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం వల్లూరులో మాట్లాడుతూ చరిత్రలోనే తొలిసారిగా గవర్నరు ద్వారా ఆర్డినెన్స్ తీసుకురావడంతో సంఘం తరపున సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడేపల్లిగూడెం: 90102 23729, 90100 68395, 63097 62918
తణుకు: 90108 43311, 90100 51493
Office mail : tpgadvt@gmail.com